# నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ

- ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరణ
- నామపత్రాల దాఖలుకు ఈ నెల 10 వరకు గడువు
- జనరల్ అభ్యర్థులకు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.5 వేల డిపాజిట్
- 13న స్క్రూట్నీ.. పోటీకి అర్హత ఉన్న అభ్యర్థుల వివరాల వెల్లడి
- ఉపసంహరణకు 15 వరకు అవకాశం..
- అదే రోజు తుది జాబితా ప్రకటన
- నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు: ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఈ నెల 30న జరుగనన్న శాసనసభ ఎన్నికల కోసం శుక్రవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. శుక్రవారం నుంచి శాసనసభా నియోజకవర్గ కేంద్రాల్లో రిటర్నింగ్ అధికారులు పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ ప్రక్రియ 10 వరకు కొనసాగనుంది. ఇందుకోసం అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా అధికారులు పోటీ చేసే అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలు, నియమాలు, అవసరమైన ధ్రువపత్రాల వివరాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందుబాటులో ఉంచారు. నామినేషన్ దాఖలు చేసేందుకు అభ్యర్థులు అనుసరించాల్సిన పద్ధతులు, జాగ్రత్తలను వివరించేందుకు కార్యాలయంలో సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం నుంచి నామినేషన్లు ప్రారంభమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్రీయ రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు చెల్లించే డిపాజిట్లు ఒకే రకంగా ఉన్నాయి. జనరల్ స్థానం నుంచి పోటీ చేసే జనరల్ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ స్థానాలు లేదా జనరల్ స్థానాల నుంచి పోటీ చేసే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలను డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. అభ్యర్థులు నోటరీ ద్వారా తమ ఆస్తులు, ఆదాయ వ్యయాలతోపాటు తమపై ఉన్న కేసుల వివరాలను నామినేషన్ పత్రాల్లో చూపించాల్సి ఉంటుంది. నామినేషన్ వేస్తున్న అభ్యర్థుల పేరు ప్రస్తుతం ఎన్నికల కమిషన్ ప్రకటించిన ఓటర్ల జాబితాలో తప్పనిసరిగా నమోదై ఉండాలి. అభ్యర్థుల ప్రతిపాదకులు కూడా స్థానిక నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగి ఉండాలి. ప్రతి అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖాలు చేసేందుకు కమిషన్ అవకాశం కల్పించింది. ఈ నెల 10న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం ఉంది. వచ్చిన నామినేషన్లను 13న స్క్రూట్నీ చేస్తారు. పోటీలో ఉండేందుకు అర్హత ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. అదే రోజు నుంచి 15వ తేదీ సాయంత్రం వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. ఆ గడువు ముగిసిన వెంటనే ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తారు. నామినేషన్లు స్వీకరించే ఆర్వో కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయానికి 100 మీటర్ల వరకు నిర్దేశించిన వారిని మాత్రమే అనుమతిస్తారు. పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేయనున్నారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

### పకడ్బందీ ఏర్పాట్లు: కలెక్టర్ వీపీ గౌతమ్

జిల్లాలో నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. ఖమ్మం రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాలేరు అసెంబ్లీ నియోజకవర్గ, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఖమ్మం రిటర్నింగ్ అధికారి ఆదర్శ్ సురభి, పాలేరు రిటర్నింగ్ అధికారి ఎం.రాజేశ్వరి, ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి, తహసీల్దార్లు రామకృష్ణ, సీహెచ్ స్వామి, అధికారులు పాల్గొన్నారు.

## పాలేరు కరువును తీర్చిన ఘనత..

# బీఆర్ఎస్ ప్రభుత్వానిదే..

- మీలో ఒకరిగా, మీ కష్టాల్లో తోడుగా ఉన్న నాకు మద్దతునివ్వండి
- ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ పాలేరు అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి, నవంబర్ 2: కరువు కోరల్లో ఉన్న పాలేరు ప్రజలను ఆదుకొని అక్కున చేర్చుకున్నది ముఖ్యమంత్రి కేసీఆరేనని బీఆర్ఎస్ పాలేరు నియోజకవర్గ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇక్కడి కరువును పారదోలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. కూసుమంచి మండలంలో గురువారం పర్యటించిన ఆయన.. భగత్‌వీడు కాలనీ, భగత్‌వీడు, సోమ్లాతండా, సీతిలీ తండా, మందడి నర్సయ్యగూడెం, బికారితండా, మంగలితండా, మద్దివారిగూడెం, ఈశ్వరమాదారం, రాజుపేట బజార్, తాళ్లగడ్డతండా, రాజుపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణను సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దిన గొప్ప నేత సీఎం కేసీఆర్ అని గుర్తుచేశారు. అందుకని ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్‌ను మూడోసారి కూడా ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. నిత్యం మీ మధ్యనే ఉంటూ, మీ కష్టనష్టాల్లో తోడుగా నిలుస్తున్న తనను కూడా ఈ ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. గ్రామాల్లో మిగిలిన సమస్యలను కూడా పరిష్కరిస్తామని అన్నారు. బీఆర్ఎస్ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలన్నింటినీ అధికారంలోకి వచ్చాక అమలు చేస్తామని మాట ఇచ్చారు. కాగా, ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే కందాళకు ఘన స్వాగతం పలికారు. మహిళలు వచ్చి హారతులిచ్చి బొట్టు పెట్టారు. కందాళ సొంత గ్రామంతోపాటు శివారు గ్రామాల్లో జరిగిన ప్రచారానికి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కందాళ సురేందర్‌రెడ్డి, వాసంశెట్టి వెంకటేశ్వర్లు, రామసహాయం బాలకృష్ణారెడ్డి, బాణోత్ శ్రీనివాస్, ఇంటూరి శేఖర్, వేముల వీరయ్య, ఆసీఫ్, కంచర్ల వీరారెడ్డి, అరుణ, రవి, జావత్ రాములు, భూక్యా శ్రీను, తంగెళ్ల బుచ్చిబాబు, కొక్కిరేణి సీతారాములు, భూక్యా భీక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.


భగత్‌వీడు కాలనీలో ఎమ్మెల్యే కందాళకు తిలకం దిద్దుతున్న మహిళ

# కేసీఆర్‌ను మరోసారి సీఎం చేద్దాం

- కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను మళ్లీ గెలిపిద్దాం
- వైరాలో మదన్‌లాల్‌కు భారీ మెజార్టీ అందిద్దాం
- కారేపల్లి ప్రచారంలో ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు

కారేపల్లి, నవంబర్ 2: గడిచిన పదేళ్లలో అద్భుతమైన అభివృద్ధిని చేసి చూపించిన కేసీఆర్‌ను మరోసారి సీఎంను చేద్దామని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రతీ ఒక్కరూ కారు గుర్తుకు ఓటేయాలని, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తేవాలని కోరారు. కారేపల్లి మండలంలో గురువారం పర్యటించిన ఆయన.. బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ గెలుపును కాంక్షిస్తూ స్థానిక ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, అభ్యర్థి మదన్‌లాల్‌తో కలిసి పాత కమలాపురం, కొత్త కమలాపురం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ అన్ని వర్గాలకు సముచితస్థానం కల్పించారని అన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ప్రభుత్వ ఫలాలు అందని కుటుంబాలు లేవని అన్నారు. ప్రతి లబ్ధిదారుడూ పదిమంది ఓటర్లు కారు గుర్తుకు ఓటు వేసేలా చొరవ తీసుకోవాలని కోరారు. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో బీఆర్ఎస్ తరపున వైరా నుంచి పోటీ చేస్తున్న మదన్‌లాల్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ నెల 30న జరుగనున్న ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి వైరాలో బీఆర్ఎస్ విజయాన్ని సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలను విమర్శించే వారికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం దుబ్బతండా, మేకలతండా, రేగులగూడెం, మాదారం గ్రామ పంచాయతీల్లోనూ ప్రచారం నిర్వహించారు. తొలుత గ్రామానికి చేరుకున్న నేతలకు హారతులు, పూలతో స్థానిక మహిళలు ఘన స్వాగతం పలికారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు మాలోత్ శకుంతల, వాంకుడోత్ జగన్, రావూరి శ్రీనివాసరావు, దుగ్గినేని శ్రీనివాసరావు, పెద్దబోయిన ఉమా శంకర్, ఉన్నం వీరేందర్, ముత్యాల సత్యనారాయణ, నర్సింగ్ శ్రీనివాసరావు, అడ్డగోడ ఐలయ్యా, ఎస్కే గౌసుద్దీన్, అడప పుల్లారావు, ధరావత్ పాండ్యానాయక్, జడల వసంత, జడల వెంకటేశ్వర్లు, బత్తుల శ్రీనివాసరావు, మాలోత్ కిశోర్, బానోత్ కుమార్, చాగంటి కోటయ్యా, వట్టం ఉమారాణి, పద్మ, మంగ్యా, ఈసం అరుణ, ధరావత్ మంగీలాల్, ఎండీ హనీఫ్, తాతా వెంకటేశ్వర్లు, బుడిగ ప్రభాకర్, మత్రు, సురేశ్, భూక్య చందూనాయక్, మురళి, రాము, కోటి, కల్యాణ్ పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న నామా, లావుడ్యా, మదన్‌లాల్

# మీ ఇంటివాడిగా నన్ను ఆశీర్వదించండి

- సీఎం కేసీఆర్ సహకారంతోనే కోట్లాది రూపాయల నిధులతో పట్టణాన్ని అభివృద్ధి చేశాం
- బీఆర్ఎస్ మధిర అభ్యర్థి లింగాల కమల్‌రాజు
- మున్సిపాలిటీలో ఇంటింటి ప్రచారం.. అపూర్వ స్వాగతం పలికిన పట్టణ వాసులు


కమల్‌రాజును దీవిస్తున్న ముస్లిం మతపెద్ద

మధిర, నవంబర్ 2 : కారు గుర్తుపై ఓటు వేసి మీ ఇంటి వాడిగా నన్ను ఆశీర్వదించాలని మధిర బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజు ఓటర్లను కోరారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 9, 10 వార్డుల్లో ఆయన గడపగడపకూ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమల్‌రాజు మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే కేసీఆర్ సహకారంతోనే మధిర పట్టణంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు పూర్తి చేసుకున్నామన్నారు. ఇప్పటికే 100 పకడల ఆసుపత్రి నిర్మాణం సహా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు, మినీ ట్యాంక్‌బండ్, ఇండోర్ స్టేడియం వంటి పనులు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే రూ.400కే గ్యాస్ సిలిండర్, అన్నపూర్ణ పథకం కింద తెల్లరేషన్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ సన్నబియ్యం, ఆరోగ్య రక్ష కింద రూ.15 లక్షల వరకు ఆరోగ్యశ్రీ, కేసీఆర్ బీమా ప్రతి ఇంటికి ధీమా కింద రూ.5 లక్షలు బీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. ప్రచారంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కనుమూరి వెంకటేశ్వరరావు, అరిగె శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ శీలం విద్యాలతవెంకటరెడ్డి, మాజీ జడ్పీటీసీ మూడ్ ప్రియాంక, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ యన్నంశెట్టి అప్పారావు, కౌన్సిలర్లు మల్లాది వాసు, ధరావత్ మాధవి, నాయకులు జే.వీ.రెడ్డి, ఆవుల రాము, బోగ్యం, ఇందిర, కరివేద వెంకటేశ్వరరావు, సుధాకర్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616